# సన్నాయి రాగాలు

"ఆఫీసరమ్మ రమ్మంటున్నారు సార్!"

మెల్లగా చెబుదామనుకున్న అటెండర్ ఐలయ్య స్వరమాధుర్యం సెక్షన్లో అందరికీ వినబడింది.

కూడికలూ, తీసివేతలతో కుస్తీపట్టేందు కుద్యుక్తుడౌతున్న ఎకౌంటెంట్ ప్రశాంత్ కుమార్ కరెంట్ తీసేసిన టీ.వీ. లాగైపోయాడు. చాన్నాళ్ళ తర్వాత సిటీ బస్సులో సీటు సంపాదించి ఆఫీసుకొచ్చిన సంతోషం చప్పబడిపోయింది.

ఆడపిల్ల కనబడితే చాలు - అల్లరి పెట్టాలనే మనస్తత్వం జీర్ణించుకున్న యువకులకో ఛాలెంజ్ అతడు. ఆడవాసన కెంతదూరంలో ఉంటే సుఖసంతోషాలంత దగ్గరౌతాయని విన్నాడోసారి.

ఎదురుసీట్లో కాళ్ళాడిస్తూ కూచున్న దేవయాని దొంతదండు పెదాలకు చేతి గుడ్డ అడ్డంపెట్టి కిసుక్కుమంది. రోజూ ఆఫీసుకు రాగానే మలయమారుతంలా పలుకరించే దేవయానేనా! అలా నవ్విందేమిటి?

ఈ ఆడపిల్లలింతే. సందు దొరికితే చాలు - గారడివాడు పాముల నాడించినట్టు మగాళ్ళను ఆట పట్టిస్తారు. అసలూ...: మొగాడంటే బుట్ట కింద కమ్మిన కోడిపుంజో లేక ఊరేసిన మాగాయో అనుకుంటారేమో, నంజుకు తిందామన్నట్టు చూస్తారొక్కసారి.

తొలకరి జల్లుకే చల్లబడిన వాతావరణంలా లేడీ ఆఫీసర్ కుమారి కృష్ణవేణి జాయినైన క్షణాన్నుంచి దేవయాని మారిపోయింది. పూర్తిగా మారిపోయింది.

"ఆఫీసు కెప్పుడొచ్చారు?" ఆఫీసర్ చెవుల రింగులు చెట్టుమీది పువ్వుల్లా కదిలాయి.

కనీసం కూచొమ్మని గూడా అసడంలేదు. ఎంత టెక్కో! గుండెలమీద గుదిబండ మోస్తున్నట్టుందతనికి.

"ఇప్పుడేనండీ!" కూచోబోయి నిల్చున్నాడు.

"అంటే....? కాటుక కళ్ళు బండిచక్రాలైనాయి. చేతిలోని కలం నున్నటి చెంప నానుకుంది. అదొక అపూర్వ దృశ్యం. ఆ దృశ్యాన్ని తనివిదీరా చూస్తే ఉద్యోగానికి ఉద్వాసన రావచ్చు. ఐనా, ఆడవాళ్ళతో వ్యవహారం గదా!

"సారీ.... సిటీబస్.... ఆలస్యమైంది."

"కూచుని మాట్లాడొచ్చుగా!" కుర్చీ వెనక్కు చేరగిలబడింది. చెక్కిళ్ళు పాలరాయిలా మెరుస్తున్నాయి. ఉబికివచ్చిన వయసు పొంగులు ఎంతటివాణ్ణైనా కవ్వించేలాగున్నాయి.

"అదికాదండీ!.... మీరు...."

"కూచొమ్మనేదాకా కూచోరన్నమాట?"

తకీన కూచున్నాడు. ప్రేమ కుర్చీ ముళ్ళపాన్పైంది.

"మన బడ్జెట్ ఎస్టిమేట్ స్టేట్‌మెంట్సు త్వరగా పంపాలిగదా?" ముందుకి వంగి మొహంలోకి చూస్తోంది.

స్టేటుమెంట్స్ ఫైలు సంతకం కోసం ఆవిడ టేబుల్ మీదే మురుస్తోంది, నన్ను చూడమంటూ.

చెవిటివాడిముందు శంఖమూదితే ఆ బొక్క నాకెందుకు చూపిస్తావన్నట్టు ఎకౌంటెన్సీ గురించి ఈమెకేం దెల్సూ? ఫైలు ముందున్నా గుర్తించడంలేదు.

"మీ ముందున్న ఫైలు అదేనండీ!" అభిమానం పొడుచుకొచ్చింది.

అప్పుడే నవ్వడం నేర్చిన రామచిలుకలా కిసుక్కుమంది. ఫైల్లోంచి కాయితం తీసి అతని ముందుకు తోసి "మీరు కామర్స్ గ్రాడ్యుయేట్ గదూ?" అంటూ కనురెప్పలెగరేసింది.

"ఔనండి! బికామ్ ఫస్ట్‌క్లాస్. ఐదేళ్ళ సర్వీసులో అకౌంటన్నీ అవలీలగా వ్రాసయానండీ!"

"వెరీగుడ్!"

భేష్! చిమ్మచీకట్లో చిరుదివ్వె వెలిగింది.

"థాంక్సండీ!" మెలికలు తిరిగిపోతున్నాడు.

"కానీ, మన బడ్జెట్ ఫిగర్స్ లక్షల్లో ఉండాలి గదా?" కాయితం చూడమని కళ్ళతో చెప్పింది.

ఈ కాయితమిందులో కెలా వచ్చిందీ? మొహమ్మీద ముచ్చెమట పొటమరిస్తూంది. చేతుల్లో సన్నని వణుకు. ఫిగర్స్ వందల్లో, పదుల్లో ఉన్నాయి.

"ఇవీ....ఇవి స్టేట్‌మెంట్ ఫిగర్స్ కావండీ! ఇంటి ఖర్చుల అంచనాలు. పొరపాటున....'' నాలుక తడారిపోతూంది. ఆ కాయితాన్ని నమలకుండా మింగెయ్యాలన్పించింది.

"మీకెందరు పిల్లలూ?"

''పి....పిల్లలా? నాకింకా పెళ్ళే కాలేదండీ!"

"ఐతే....'' కృష్ణవేణి ముఖారవిందము పున్నమి చందమామైంది. ''ప్రేమ పంజరంలో చిక్కుకున్నారా?"

నేనెక్కడ ఇరుక్కుంటే ఈమెకెందుకో! ప్రేమా....ప్రేమంటే... అబ్బో....ఒళ్ళంతా చెమటపట్టేస్తుంది.

"నా కసలు ప్రేమించడమే తెలీదండీ!" మొగ్గలా ముడుచుకు పోతోంది శరీరం.

కృష్ణవేణి పెదాల్లోంచి పగిలిన దానిమ్మపండు గింజల్లా మెరిసింది పళ్ళ వరుస.

o o o

మొదటిరోజు కాలేజీకెళ్ళే ముందు ''ఒరేయ్ ప్రశాంత్! కాలేజీలో ఆడపిల్లలుంటారు. ప్రేమా దోమా అంటూ వెర్రివేషా లేశావంటే మక్కెలిరుగుతాయ్ జాగ్రత్త!'' అని బాలనాగమ్మ సిన్మాలో మాయలఫకీరు డైలాగులా గొచ్చింది నాన్న వార్నింగు. ప్రేమ పెళ్ళిల్లలో కట్నం గిట్టుబాటుకాదని నాన్న జాగ్రత్తపడ్డాడనే సంగతి తెలియదప్పుడు.

"నా కొడుకు నిప్పులాంటివాడండీ!" అమ్మ తలనిమిరింది. అమ్మ సర్టిఫికేటూ, నాన్న వార్నింగూ బుర్రలో వేళ్లాడుతూ ఆడవాసనంటే అదో రకమైన ఇది ఏర్పరచాయి. అది ఎలర్జీయో, భయమో తేల్చుకో లేదింకా.

డిగ్రీ సెకండియర్లో మెరుపుతీగ విద్యుల్లత కనురెప్పలు కొంటెగా వాల్చి కవ్వించేది. కాలేజీ కుర్రాళ్ళంతా ఆవిడచుట్టూ తిరుగుతుంటే ఆవిడ చూపులు ప్రశాంత్‌కుమార్ చుట్టూ తిరిగేవి. క్లాసులో పక్కనే కూర్చుండేది. నోట్‌బుక్స్ లాక్కునేది. లెక్చరర్ గంభీరంగా సాగిపో తుంటే టింకిజెల్లా అంటించి ముసిముసి నవ్వులు రువ్వేది. వార్షికోత్స వంలో గెల్చుకున్న బహుమతుల్ని చూసింది. గదిలో ఎవ్వరూ లేనప్పుడు ఏనుగు చెవులంత కళ్ళు జేసి ఎగాదిగా చూచింది. అమాంతం కౌగిట్లో బంధించింది. నరాల్లో కరెంట్ ప్రవహించింది. వెంటనే ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకాయి.

"ఛీ పాడు! సిగ్గులేదూ?" అంటూ తోసేశాడు.

"నువ్వా మొగాడివేనా?" మొహం చిట్లించి పారిపోయింది. మళ్ళీ ఆతని జోలికి రాలేదు.

ఫైనలియర్లో మరో అనుభవం.

కాలేజీ కెళ్ళేప్పుడు ఎదురింటి విజయ దోరమాగిన మామిడి పండును దోచుకుతిందామనుకున్న తుంటరిలా చూపుల్తో తినేసేది. రోజూ గడపలో నిల్చుండేది. వోణీ అంచులు ముడేస్తూ చూపుల బాణాలు సూటిగా విసిరేది. పెదాలు వణికేవి. సమ్మోహనాస్త్రానికి బందీయై అతడే పలుకరిస్తాడనుకుంది. ఆశ అడుగంటగానే తానే పలుకరించింది. తుస్సుమన్న దీపావళి పటాకైందా ప్రయత్నం. మర్నాడు ధైర్యంగా ఎదు రొచ్చి నిలుచుంది.

"కాలేజీ కెళ్తున్నారా?" గాలికి కదుల్తున్న తీగలా నడుము ఒయ్యా రంగా మెలికలు తిరిగింది. తనను కాదన్నట్టు తప్పుకున్నాడు. కాళ్ల నేలకేసి కొట్టి-

"ఛీ....పప్పుముద్ద!" అనేసింది.

అంతటితో ఊరుకోలేదావిడ. పేరును సార్థకం చేసుకోవాలని, పరీక్షాఫలితాలొచ్చిన రోజు అతని గదిలో ప్రత్యక్షమైంది.

కంగ్రాట్స్ చెప్పి, బలవంతంగా చెయ్యి కలిపింది. అతని మెదడు మొద్దుబారింది. కాస్సేపు వెన్నుపూసలో వానపాము పాకింది.

"ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారుగా, పార్టీ ఏదీ?" సోయగాన్నంతా సొంతం చేసుకుని నిగనిగలాడుతున్న బుగ్గలు ఎర్ర గులాబీలైనాయి. కళ్ళల్లో కమ్మని మెరుపు. రెస్పాన్స్ లేకపోతే మళ్ళీ పప్పుముద్దంటుం దేమో! ఏదో ఒకటి మాట్లాడాలి.

'కష్టపడి చదివి క్లాసులో పాసయ్యాను. మీరే నాకు పార్టీ ఇవ్వాలి."

"అలాగా, ష్యూర్!" రెండు చేతుల్తో చెంపలు పట్టుకుని ముద్దులు వడ్డించింది. "ఐ లవ్ యు ప్రశాంత్!" అంటూ చెట్టునుంచి రాలిన పూవులా ఛాతి మీద ఒరిగిపోయింది. అంతరంగం నుండి ఉబికొచ్చిన శక్తి కదలనీయలేదు.

కిటికీలోంచి కనబడిందమ్మకు.

"ఎవర్రా అమ్మాయి?" అంటూ పరుగెత్తుకొచ్చింది. వెంట బామ్మ గూడా వుంది. విజయ తుర్రుమంది. నాన్నకి విషయం తెలీగానే అగ్గి మీద గుగ్గిలమైపోయాడు. చీవాట్లతో తల వాచిపోయింది. రాత్రికి భోంచెయ్యాలన్పించలేదు. బామ్మ వచ్చి బుజ్జగించింది.

"గడుగ్గాయి పిల్ల సిగ్గు విడిచి అంతమాటంటే, నీ నోట్లో నాలు కేమైందిరా? ముంతకింది పప్పువై పోయావెందుకురా?"

"ఏం చెయ్యాలో తోచలేదే బామ్మా!" ఏడుపొచ్చినంత పనైంది. నెత్తిమీద మొట్టికాయ వడ్డించి భోజనానికి తీసికెళ్ళింది.

ఉద్యోగంలో జాయినవగానే పెళ్ళిచూపుల కాహ్వానాలు రాసాగాయి.

పెళ్ళిచూపులా....? పెళ్ళిచూపులంటే, ముక్కూమొహం తెలీని ఆడదాన్ని ఇంటర్వ్యూ చెయ్యాలి. సిగ్గు విడిచి ప్రశ్నలడగాలి, అడిగించు కోవాలి. అమ్మాయి నచ్చలేదంటే అమ్మాయికీ, ఆమె తల్లిదండ్రులకూ బాధ. నచ్చిందంటే అమ్మా నాన్నకూ కట్నం నచ్చాలి. ప్చ్.... ఇదంతా సవ్యంగా జరిగితే చివరకు మిగిలేది మెడకో గుదిబండ.

"పెళ్ళిచూపులంటే నాకు గిట్టవు!" కుండ బద్దలైపోయింది. ఎన్ని సార్లు కదిపినా అదే సమాధానం.

o o o

అసలీ ప్రేమించేవాళ్ళెలా ప్రేమిస్తారో?.... పెళ్ళిదాకా ఎలా వస్తారో?.... ఈమధ్యే ప్రశాంత్ కుమార్ బుర్రను తొలిచేస్తుందా అనుమానం. లంచవర్లో ఐలయ్య ముందుంచాడా అనుమానం.

"ఆ....దాందేముంది సార్!" వంద ప్రేమ సినిమాల్లో నటించిన బాక్సాఫీసు హీరో ఐపోయాడు ఐలయ్య. "తెగువతో మగువను పలుకరించాలి. తియ్యని మాటల్తో చిత్తు చేసి, కళ్ళల్లో కళ్ళు కలపాలి. మెల్లిగా దార్లోకి రాగానే బుట్టలో వేసుకోవాలి. చూపుల్తో తినెయ్యాలసలు. అసలు రహస్యమేమంటే ముద్దులాశించే ముందు గుద్దులు భరించేందుగ్గూడా రెడీగుండాలి." ప్రేమ పురాణం విప్పేశాడు.

ఇదేదో బాగానే ఉన్నట్టుంది. కాని, ఎక్కడ ప్రారంభించాలో....

"ఆడది తోడులేని జీవితం అడవి గాచిన వెన్నెల సార్!" మూల మంత్రోపదేశమైంది.

చిక్కు వీడని కురుల్లా ఊహ లేవో చుట్టుకుపోతున్నాయప్పుడే.

"అంతేనంటావా ఐలయ్యా?"

"అదంతేగానీ....ఈమధ్యా మీలో ఏదో మార్పు కన్పిస్తుంది సార్! దేవయానమ్మమా, జయంతమ్మమా అదోలా చూస్తున్నారు. నేనంతా గమనిస్తున్నాను సార్!"

కాఫీ డబ్బులు వసూలు చేసుకున్నాడు.

సీటు వద్దకు రాగానే చాంబర్లోంచి పిలుపొచ్చింది.

"డి.ఏ. అరియర్స్ బిల్ ఇన్ టైంలో చేయించారు. వెరీగుడ్!" అప్పుడే విచ్చుకున్న ముద్దమందారంలాగుంది కృష్ణవేణి మొహం. కాటుక కళ్ళు గండుతుమ్మెదల్లా కదుల్తూంటే నుదుటి సిందూరం వాటిని కంట్రోల్ చేస్తుంది. జడలోని మల్లెదండ గుండెల మీదాడుకుంటుంది.

"నా సెక్షన్లో దేవయాని,జయంతిగారలు సిన్సియర్ వర్కర్సండీ!" మల్లెదండమీద వాలాయి చూపులు.

"ఔనూ....ఇద్దరు యువతుల మధ్య పంజెయ్యడం మీకెలాగుంది?" సన్నటి పెదాలకు నున్నటికలం తాకింది.

పర్వాలేదు. ఈవిడ సరదా మనిషే. ధైర్యం జబ్బ చరిచింది.

"హలో కృష్ణా!" హెచ్చరికలేని తుపాన్‌లా చొచ్చుకొచ్చాడో యువకుడు. వీడెవడో ఇప్పుడే రావాలా?

"హలో బావా!" కృష్ణవేణి లేచి నిలబడింది. ఎదురెళ్ళి సూటుకేసం దుకుంది. వచ్చినాయన ఆవిడ మేనబావ సుభాషనీ, మిలటరీ ఆఫీసరనీ పరిచయంలో తేలింది.

"ఉత్తరమందిందా బావా?" మోచేతులు టేబుల్‌మీ దానించి ముందుకు వంగింది.

"అందింది. ఈసారి పెళ్ళి చేసుకుని జంటగా వెల్దామనే వచ్చా!"

నవ్వుకున్నారిద్దరూ.

పానకంలో పుడకలా తానెందుకూ? బయటికొస్తుంటే దేవయాని ఢీకొట్టింది. కొత్త వీణను శృతిచేసినట్టు నరాలు జివ్వుమన్నాయి. ఫైలు గుండెలకు హత్తుకుని చాంబర్లో కెళ్ళబోతుందావిడ.

"నన్నెందు కాపారు సార్?" కళ్ళతో ప్రశ్నించింది, చెంపలమీది ముంగురుల్ని సవరించుకోకుండా.

ఆ ముంగురుల్ని సవరించే సన్నుతాంగుడెవడో....ఆ కనుగవ్వల కాంతిపుంజాల నేరుకొనే అదృష్టవంతుడెవడో?!

"అలా....కొత్తగా చూస్తున్నారేమిటి సార్?" పైట భుజాల్ని కప్పేసింది.

"లోపల ఆఫీసర్‌గారి మేనబావున్నారు. వారేదో సరదాగా...."

"అంతేనా?" మాట విరిచేసి మూతిని మూడు వంకర్లు తిప్పేసింది. అదో బ్యూటీ స్వీ కేన్స్.

"అంటే....?"

"మీకేమన్నా అక్షంతలు పడ్డాయనుకున్నాను."

"అక్షంతలు వేసేందుకు తప్ప మరెందుకూ పిలిపించరా నన్ను కృష్ణవేణిగారు?" ఉక్రోషం పొడుచుకొచ్చింది.

''ఆహా! ఐతే, వేరే పనులగ్గూడా పిలిపించుకుంటారుగదూ!" ఒత్తి పలికి చాంబర్లోకి దూసుకుపోయింది.

మొదటి కాంట్రాక్టులోనే మొత్తం నష్టపోయిన కాంట్రాక్టరులా గయిందతని వాలకం.

సీటువద్దకు రాగానే—

''మీరు ఏకంగా మనాఫీసరమ్మనే ప్రేమించెయ్యండి సార్!" అని సలహా పారేసి మెలికలు తిరిగిపోతున్నాడు ఐలయ్య. పక్కనున్న జయంతి ఫక్కున నవ్వింది.

"యూ షటప్ అండ్ గెటౌట్ ఐలయ్యా!" కాంప్లెక్సు పొడుసు కొచ్చింది. జయంతి నవ్వు ఆర్పేసిన లైటులా ఆగిపోయింది.

o o o

"ఈ రోజు మీరు కృష్ణవేణిగారింటికొస్తున్నారు" అంది దేవయాని ప్రశాంత్ కుమార్తో.

"ఎందుకూ?"

"ఆవిడ పెళ్ళి సెటిలై పోయింది. నాదీ గూడా సెటిలై పోయింది. ఈ రోజు సాయంత్రం వాళ్ళింట్లో రెండు పెళ్ళిళ్ళకి నిశ్చితార్థాలు. మీరు తప్పక రావాలి."

"అరెరే.... అందరి పెళ్ళిళ్ళైపోతే.... ఇహ మిగిలేదెవరూ?''పక్క నున్న జయంతివైపు మళ్ళాయతని చూపులు.

"వచ్చే సోమవారం నా పెళ్ళి. మీరు తప్పకుండా రావాలి సార్!" శుభలేఖ అందించింది జయంతి. జయంతి పక్కన కృష్ణవేణి నిలుచుంది.

"ఆ.... మీరా?" స్ప్రింగ్‌లా లేచాడు. కృష్ణవేణి గలగలా నవ్వేసింది. నవ్వుకాదది. మేలిమి ముత్యాలజల్లు. కాని, ఆఫీసరలా ఎందుకు నవ్వినట్టో....!

యవ్వనం తాలూకు మెరుపులన్నీ కృష్ణవేణిలో ఉన్నాయి. ముద్దుగా, కుందనబొమ్మలాగుంది.

"సాయంత్రం మా ఇంటికి తప్పక రావాలి!" అంటూ వయ్యారంగా వెనుదిరిగి రాజహంసలా అడుగువేస్తుంది.

"ఐనా.... మీ పెళ్ళికి నిశ్చితార్థం ఆఫీసర్ గారింట్లోనా?" దేవయాని నడుగుదామనుకునే లోపలే వెళ్ళిపోయింది కృష్ణవేణి వెంట.

o o o

కృష్ణవేణి ఇల్లు సందడిగా ఉంది. సుభాష్ ఎదురొచ్చి స్వాగతం పలికాడు ప్రశాంత్ కుమార్‌కు.

క్రికెట్ మ్యాచ్‌లో సెంచరీ చేస్తానని ప్రతిజ్ఞ చేసి మొదటి బాల్‌కే ఔటైన మేటి బ్యాట్స్‌మెన్‌లాగుంది ప్రశాంత్‌కుమార్ పరిస్థితి.

"కంగ్రాట్స్.... అదృష్టవంతులు" అనేశాడు సుభాష్‌తో.

"థాంక్స్.... ఎక్స్‌క్యూజ్‌మీ...." మరోవైపు నడిచాడు సుభాష్ ఇంకెవర్నో రిసీవ్ చేసుకునేందుకు.

సహారా ఎడారిలో మిట్ట మధ్యాహ్నం ఒంటరి ప్రయాణంలాగే ఉంది తన బతుకు.... ప్చ్.... నిరాశ నిలదీసింది.

"స్వాగతం.... సుస్వాగతం సార్!" అప్సరసలా కనబడింది దేవయాని. చిరునవ్వు పెదాలకతికించుకోక తప్పలేదు.

"మీక్కాబోయే భర్తను పరిచయం చెయ్యరా?"

"నాక్కాబోయే భర్త సుభాష్ గారండీ!"

"ఆయన కృష్ణవేణిగారి మేనబావగదా?!"

"నిజమే...." కృష్ణవేణితో తిరిగొచ్చిన సుభాష్ అందుకున్నాడు: "కృష్ణవేణీ నేనూ వరుసకు బావా మరదళ్ళమే కాని వ్యవహారానికి మాత్రం అన్నా చెల్లెళ్ళం. దేవయానీ నేనూ ఒకే కాలేజీలో చదువుకున్నాం. అప్పుడే మా ప్రేమ మొగ్గదొడిగింది."

"ఇప్పుడు వికసించింది." కృష్ణవేణి పెదాల మీద దరహాస చంద్రికలు ప్రశాంత్‌కుమార్ నల్లరి పెడ్తున్నాయి. కాని.... ఇదో మాయాలోకం. ఇక్కడంతా అయోమయం.

"మరి కృష్ణవేణి గారిక్కాబోయే...."

"అది మీ బామ్మగారి నడగండి!" చిన్నపిల్లలా కిసుక్కుమంది కృష్ణవేణి.

అరె.... బామ్మా.... ఎప్పుడొచ్చింది? ఎందుకొచ్చింది?!

"నువ్వెందుకొచ్చావే బామ్మా?"

"ఇదేం చోద్యంరా! నా మనవని నిశ్చితార్థానికి నేను రావద్దా?" బుగ్గలు నొక్కుకుంది బామ్మ.

బాక్సాఫీసు బద్దలు కొట్టాలనే దురాశతో కథనంతా గందరగోళం చేసుకున్న సినీ నిర్మాతయాడు.

"ఈవిడ మా బామ్మ సీతమ్మ!" మరో ముసలమ్మను పరిచయం చేసింది కృష్ణవేణి.

"అబ్బాయి చాకులాగున్నాడే!" సీతమ్మ ప్రశంస.

"ఇదంతా ఏమిటే బామ్మా!"జుట్టు పీక్కోవాలనిపించింది ప్రశాంత్ కుమార్‌కు.

"సీతమ్మా, నేనూ రోజూ గుడిలో కలుసుకుంటున్నాంరా! నీ భయం గురించీ, కృష్ణవేణి ధైర్యం గురించీ మాట్లాడుకున్నాం. ముందే నీకు తెలిస్తే ముందట్లాగా కొంప ముంచేస్తావని మేమంతా కూడబలుక్కుని కృష్ణవేణికీ, నీకూ పెళ్ళి నిర్ణయించాంరా! ఈరోజు నిశ్చితార్థం. వారం రోజుల్లో సన్నాయిరాగాలు....సంవత్సరం తిరిగేలోగా నాకో ముని మనవడు...." బామ్మ మాటలు బంగారు మూటల్లాగున్నాయి.

"అరె....అమ్మా, నాన్నలు కూడా వచ్చారే!" గుఱ్ఱప్పందాల్లో జాక్‌పాట్ కొట్టేసినట్టనిపిస్తోంది. కృష్ణవేణి బుగ్గలమీద సిగ్గుల సింగారం.

(మయూరి వీక్లీ, 25 ఆగస్టు, 95)